# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి : 18 సంచిక : 311 మంగళవారం, జులై 8, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam


# మనం చెట్టును కాపాడితే చెట్టు మనల్ని కాపాడుతుంది



**- రుద్రాక్ష మొక్క నాటి ప్రతిజ్ఞ చేసిన రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్** తెలంగాణ ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ వర్సిటీలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అక్కడి బొటానికల్ గార్డెన్స్‌లో రుద్రాక్ష మొక్క నాటిన ఆయన ప్రతి మహిళ కూడా ఇంట్లో పెరడులో రెండు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మీ రాజకీయ జీవితాన్ని మొక్కలు నాటడంతో ప్రారంభించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరగబోతున్నాయని మహిళకు 50కు పైగా సీట్లు వస్తాయని తెలిపారు. తాను మాత్రం ప్రత్యేక చొరవ తీసుకొని 60 సీట్లు మహిళలకు ఇప్పించి గెలిపిస్తానని చెప్పుకొచ్చారు.

మొక్కలు నాటి వనాలు ఏర్పాటు చేసినప్పుడే అభివృద్ధికి విలువ ఉంటుందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అందుకే తెలంగాణను పచ్చని వానాలకు

2లో..

# బ్రిక్స్ కూటమిలో కొత్త సభ్యదేశం

**- ఇండోనేషియాకు స్వాగతం పలికిన ప్రధాని మోదీ**




**రియో డి జనీరో** అంతర్జాతీయంగా వేగంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్న బ్రిక్స్ కూటమి మరింత విస్తరించింది. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరుగుతున్న 17వ బ్రిక్స్ సదస్సులో ఇండోనేషియా పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ పరిణామం బహుళపక్ష వేదికలపై భారత్ కు పెరుగుతున్న దౌత్యపరమైన పలుకుబడికి నిదర్శనమని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సదస్సు వివరాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (ఆర్థిక సంబంధాలు) దమ్ము రవి మీడియాకు వెల్లడించారు. "సదస్సులో తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ద సిల్వాకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే బ్రిక్స్ కూటమిలో పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరిన ఇండోనేషియా అధ్యక్షుడికి స్వాగతం పలికారు" అని దమ్ము రవి వివరించారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడాన్ని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ఎంతో విలువైనదిగా భావించారని ఆయన తెలిపారు. ఈ చేరికపై ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కూడా స్పందించారు. 'సమ్మిళిత, సుస్థిర పాలన కోసం గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సులో ప్రపంచ సవాళ్లపై సభ్య దేశాల నేతలతో అభిప్రాయాలు పంచుకున్నట్లు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. ఆర్థిక, సాంకేతిక, విద్యా రంగాల్లో జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ, న్యాయమైన ప్రపంచ సహకారానికి ఇండోనేషియా కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని దమ్ము రవి పేర్కొన్నారు. వ్యవస్థాపక సభ్యదేశమైన భారత్ పాత్రను సదస్సులో ప్రత్యేకంగా గుర్తించారని తెలిపారు. ఈ సదస్సులో 11 శాశ్వత సభ్యదేశాలు, 9 భాగస్వామ్య దేశాలు, 8 ఆహ్వానిత దేశాలు, 7 అంతర్జాతీయ సంస్థల అధిపతులు పాల్గొనడం బ్రిక్స్ కు పెరుగుతున్న ప్రాముఖ్యతను సూచిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఖేలో ఇండియా

**గేమ్స్‌నుతెలంగాణలో నిర్వహించండి**

**- కేంద్రాన్ని కోరిన రేవంత్ రెడ్డి**



**న్యూఢిల్లీ** ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్. మాండవీయకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియాతో పాటు జాతీయ క్రీడలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణులఎంపిక ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు

2లో..

# ఓట్ల కోసమే ప్రభుత్వం రైతుబంధు నిధులు విడుదల చేస్తోంది

**- కేసీఆర్ నాట్ల మధ్య.. రేవంత్ ఓట్ల మధ్య రైతుబంధు ఇస్తున్నారని వ్యాఖ్య**

**- గ్రామాల్లో ఎరువులు, యూరియా కొరత తీవ్రంగా ఉందని వెల్లడి**

**- ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శ**

**హైదరాబాద్** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేవలం పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఇప్పుడు రైతుబంధు నిధులను విడుదల చేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన గత బీఆర్ఎస్ పాలనను ప్రస్తుత ప్రభుత్వంతో పోలుస్తూ విమర్శలు గుప్పించారు. "కేసీఆర్ రైతుల అవసరాలు గుర్తించి నాట్లకు, నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓట్లకు, ఓట్లకు మధ్య రైతుబంధు ఇస్తోంది" అని ఆయన ఎద్దేవా చేశారు. ఇది పూర్తిగా రాజకీయ లబ్ధి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, గ్రామాల్లో ఎరువులు, యూరియా కొరత తీవ్రంగా ఉందని హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల



సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల పాలన కుంటుపడిందని ఆయన ఆరోపించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికను సవాలుగా స్వీకరిస్తున్నాం

**- 25 రోజుల్లో బీజేపీ రాష్ట్ర నూతన కమిటీ ప్రకటన**

**- కమిటీలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం**

**- ఇకపై స్థానిక సంస్థల ఎన్నికలపైనా పూర్తిస్థాయిలో దృష్టి**

**- పార్టీలో ఎలాంటి వర్గాలు లేవని స్పష్టం చేసిన చీఫ్**

**హైదరాబాద్** జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికను తమ పార్టీ ఒక సవాలుగా తీసుకుంటోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. బలమైన ప్రతిపక్షం బరిలో ఉంటే ఉప ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించడం సాధ్యం కాదని ఆయన అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న 25 రోజుల్లోనే బీజేపీ పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని రామచందర్‌రావు వెల్లడించారు. పార్టీలోని ముఖ్య నేతలతో చర్చించి, అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్టీలో ఎటువంటి వర్గాలు లేవని, అందరూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఐక్యంగా పనిచేస్తారని ఆయన వివరించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ పెద్దగా దృష్టి సారించలేదని, అయితే ఈసారి వాటిపైనా ప్రత్యేకంగా దృష్టి పెడతామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్

**- టర్కీ సంస్థకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ**

**న్యూఢిల్లీ** దేశంలోని విమానాశ్రయాల్లో సేవలు అందిస్తున్న టర్కీ సంస్థ 'సెలెబి'కి ఢిల్లీ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తమ సంస్థకు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) రద్దు చేసిన సెక్యూరిటీ క్లియరెన్స్‌ను పునరుద్ధరించాలని కోరుతూ సెలెబి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. జాతీయ భద్రతకు సంబంధించిన విషయంలో ప్రభుత్వ నిర్ణయమే సరైనదని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కేవలం దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొనే సెలెబి సంస్థ క్లియరెన్స్‌ను రద్దు చేసినట్లు కోర్టుకు తెలిపారు. కేంద్రం వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అంతకుముందు, తమకు ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా బీసీఏఎస్ ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకుందని సెలెబి తరఫు న్యాయవాది వాదించారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 3,800 మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, భారత విమానయాన రంగంలో పెట్టుబడులపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ డ్రోన్లు, క్షిపణులను అందించి మద్దతుగా నిలిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్‌లో 'బాయ్‌కాట్ టర్కీ' నినాదం జోరందుకున్న





2లో..

# మరో బాంబ్ పేల్చిన ట్రంప్

**- బ్రిక్స్ అనుకూల దేశాలపై 10 శాతం అదనపు టారిఫ్‌లు**

**న్యూయార్క్** అమెరికా, బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చింది. బ్రిక్స్ కూటమి అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశంపైన అయినా అదనంగా 10 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ విధానంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు.



సోమవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు. "బ్రిక్స్ కూటమి అవలంబిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలతో ఏ దేశం ఏకీభవించినా, ఆ దేశంపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తాం. ఈ విషయంలో మీరంతా దృష్టి సారించినందుకు ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. ఈ కొత్త సుంకాల విధానానికి సంబంధించిన అధికారిక లేఖలను సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి వివిధ దేశాలకు పంపనున్నట్లు మరో సందేశంలో తెలిపారు. ప్రస్తుతం బ్రెజిల్‌లోని రియో డి జెనీరోలో బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ సదస్సులో అమెరికా ఏకపక్షంగా సుంకాలను

2లో..

# రైతే.. దేశానికి వెన్నెముక..

- అన్నదాతను కాపాడుకోవాలిసాంకేతికత - ప్రాచీన పద్ధతులను అనుసరించాలి
- వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకురావాలి - సేంద్రియ ఎరువులను వినియోగించాలి
- నాణ్యమైన దిగుబడిన సాధించాలి
- అప్పుడే రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ
- రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న రాస్
- కృషి విజ్ఞాన కేంద్రం సేవలను అభినందించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు

**రేణిగుంట** మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయం సంక్షోభానికి గురువుతోందని, ఈ నేపథ్యంలో దేశానికి వెన్నెముక ఆయన రైతును కాపాడుకోవాల్సి సామాజిక బాధ్యత తమ అందరి పై ఉందన్న కర్తవ్యాన్ని గుర్తు చేశారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. సాంకేతికత–ప్రాచీన పద్ధతులను అనుసరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవడం పై దృష్టి పెట్టాలని ఆయన అన్నదాతలకు సూచించారు. ఆధునిక యుగంలో కూడా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే అధునాతన పద్ధతుల పై అవగాహన కల్పిస్తూ రైతులను చైతన్య పరుస్తున్న రాస్ –కృషి విజ్ఞాన కేంద్రం సేవలను ఎంపీ ఈ సందర్భంగా కొనియాడారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ, వనస్థలి సమీపంలోని రాస్– కృషి విజ్ఞాన కేంద్రంలో ఖరీఫ్ పంటలకు సంబంధించి., రైతులకు శిక్షణ.., ఇన్ పుట్స్ పంపిణీ.., షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు రాస్– కృషి విజ్ఞాన కేంద్రానికి చేరుకున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళకు..,రాజ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం, అసోసియేట్ డైరెక్టర్ సుమతి, రాసు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, ప్రోగ్రెసివ్ ఫార్మర్ నాగేశ్వరరాజు.., రాసు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రాజశేఖర్ నాయుడు, ప్రోగ్రెసివ్ ఫార్మర్ కొండ యాదవ్, కెవికె సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం రాస్– కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎన్జీరంగా విగ్రహానికి చిత్తూరు ఎంపీ, కెవికె అధికారులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తరువాత రాస్ కృషి విజ్ఞాన కేంద్రం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కె వి కె శాస్త్రవేత్తలు అనుసరిస్తున్న వ్యవసాయ అధునాతన పద్ధతులు, పరిశోధనలకు సంబంధించిన వివరాలను రాస్– కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావుకు వివరించారు. అంతేకాకుండా రాస్– కృషి విజ్ఞాన కేంద్రంలో వేసిన పంటలు.., ఆయుర్వేద మొక్కల పనితీరును, చెరకు, మామిడి, వేరుశనగ, పౌల్ట్రీ విషయంలో అనుసరిస్తున్న విధానాలు, అధిక దిగుబడులు సాధించడం ఎలా అన్న అంశాలను కూలంకుషంగా ఎంపీకి వివరించారు. కెవికె శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనల పై చిత్తూరు పార్లమెంటు సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత నిర్వహించిన అవగాహన సదస్సులో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ..నవీన యుగంలో వ్యవసాయం కష్టతరంగా మారిందన్నారు. అధునాతన పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేస్తున్నా.., ప్రకృతి వైపరీత్యాలు కన్నెర్ర చేయడంతో రైతు తీవ్రంగా నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దిగుబడి లాభసాటిగా ఉన్నా.., పంటకు మద్దతు ధర లభించక.. వ్యవసాయం భారంగా మారిందన్నారు. అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలిచినా.., సంక్షోభం నుంచి వ్యవసాయాన్ని గట్టెక్కించలేక పోతుందన్నారు. ఈ నేపథ్యంలో రైతన్నలు సాంకేతిక ప్రాచీన పద్ధతులను అనుసరించి, వ్యవసాయానికి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. సేంద్రీయ ఎరువులను వినియోగించి నాణ్యమైన దిగుబడులను సాధించాలని చిత్తూరు ఎంపీ అన్నదాతలకు సూచించారు. అప్పుడే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలియజేశారు. అవగాహన సదస్సులో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లను ఎంపీ అందజేశారు. రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తున్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సేవలను ఆయన కొనియాడారు. ఈ అవగాహన సదస్సులో కెవికె అధికారులతో పాటు టిడిపి చిత్తూరు జిల్లా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, తెలుగు రైతు అధ్యక్షులు నాగేశ్వరరావు, కెవికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## బాధితులకు బాసటగా

# చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ

- సీయం సహాయ నిధి ద్వారా ఆప్తులకు ఆపన్న హస్తం
- 8 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన దగ్గుమళ్ళ ప్రసాదరావు
- చిత్తూరు పార్లమెంటు సభ్యునికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు



**చిత్తూరు** చిత్తూరు పార్లమెంటు పరిధిలోని పలు బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు... ఆపదలో ఉన్న ఆప్తులకు ఆపన్న హస్తాన్ని అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎనిమిది మంది బాదితులకు సుమారు 13,27,560 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకున్నారు. చిత్తూరులోని ఎంపీ కార్యాలయంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని, పేద ప్రజల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఉన్న చిత్తశుద్ధిని వివరించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కలు పొందిన వారిలో పెనుమూరు మండలం, పెలితళ్లు గ్రామానికి చెందిన యన్.నాధముని( 42,746),జీడీ నెల్లూరు మండలం, వింజం గ్రామానికి చెందిన కె.మోహన్ రెడ్డి (44,195),ఐరాల మండలం, పొలకల గ్రామానికి చెందిన బేబీ ప్రత్యూష (35,917), పుంగనూరు,తేరువీధికి చెందిన బి.విజయకుమార్ (2,00,000), ఐరాల మండలం, ఐరాల గ్రామానికి చెందిన రాజారెడ్డి (1,15000),వెదురు కుప్పం మండలం పెరుమళ్ళపల్లి గ్రామానికి చెందిన రవిబాబు (2,09,945), చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 190 రామా పురానికి చెందిన దేవేంద్ర బాబు ( 51,385), తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట గ్రామానికి చెందిన జి. గిరిబాబు (6,28,372) ఉన్నారు. కష్టాలలో ఉన్న వారందరికీ అండగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావుకు ఈ సందర్భంగా బాదిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. ప్రజల కష్టాలు తెలిసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు లాంటి వారు చిత్తూరు పార్లమెంటు సభ్యులుగా ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ద

# గాయత్రి ఆసుపత్రి సీజ్

**భువనగిరి** భువనగిరి గాయత్రి ఆసుపత్రి పై ఎస్వోటీ పోలీసులు దాడి చేసారు. అర్ధరాత్రి డాక్టర్ శివ కుమార్ ఇద్దరు మహిళలకు అబార్షన్ చేసారు. గాయాత్రి ఆసుపత్రి అబార్షన్లకు అడ్డాగా మారింది పలు పిర్యాదులందఅయి. దాంతో పోలీసులు దాడులు జరిపారు. డాక్టర్ శివకుమార్ 2022లో ఆలేర్ లో బాలికకు అబార్షన్ చేసి రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు. దాంతో అప్పట్లో స్వాతి ఆసుపత్రి ని వైద్యాధికారులు సీజ్ చేసారు.

ఆ తరువాత పేరు మార్చి గాయత్రి ఆసుపత్రిగా రన్ చేస్తున్నారు. అబార్షన్ కు 50,000 తీసుకొని వైద్యం అందిస్తున్నారు డాక్టర్ శివకుమార్ . గాయత్రి హాస్పిటల్ ఏర్పాటు చేశాక ఎన్ని అబార్షన్లు చేశాడంటూ రికార్డ్స్ భువనగిరి ఎస్ఓటి పోలీసులు పరిశీలించారు. డాక్టర్ శివకుమార్ను భువనగిరి పోలీసులకు హ్యాండోవర్ చేసారు.

# జూలై 9న జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




**పొన్నూరు :** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అనుకూలమైనటువంటి 40 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి యజమానుకు అనుకూలముగా చేసినందుకు నిరసనగా సోమవారం గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణము ఐలాండ్ సెంటర్ నందు భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుమ్మడి రోశయ్య అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోర్స్ వల్ల కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని దానిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన అన్ని రంగాలకు సంబంధించిన కార్మికులు ఉద్యోగులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొంటున్నారని పొన్నూరులో కూడా కార్మిక వర్గం ఉద్యోగులు భారీ సంఖ్యలో జూలై 9వ తేదీన సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని అన్నారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా కౌన్సిల్ మెంబర్ గుంటూరు ఏడుకొండలు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్నామని ఆ సంక్షేమ బోర్డు ద్వారా గతంలో గత ప్రభుత్వాలు రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు గానీ, చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు గానీ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి ఆర్థిక సహాయం ఇచ్చారని గత ప్రభుత్వ కాలము నుండి కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి ఏమి ఇవ్వలేదని, ఇప్పుడు సంక్షేమ బోర్డులో నిధులు వాడుకొని కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మిక్కిలి జాన్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఇవ్వలేని 46 వేల క్లైములను లను మేము పరిష్కరిస్తామని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయకుండా అన్యాయం చేస్తుందని అన్నారు సంక్షేమ బోర్డుని కాపాడుకునేంతవరకు మా పోరాటం కొనసాగుతుందని అన్నారు. కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎక్కడో ఒకచోట పవన్ కళ్యాణ్ ఆయన నియోజకవర్గంలోని ఎలక్ట్రిషన్కు 40 మందికి మాత్రమే కిట్లు ఇచ్చారని రాష్ట్రంలో ఉన్న మిగతా కార్మికులంతా కూడా భవన నిర్మాణ కార్మికులే కాబట్టి ఆయన ఇచ్చినటువంటి వాగ్దానం మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శివాజీ, సూరిబాబు, కోటేశ్వరరావు, రామయ్య, రాడ్ బెండింగ్ యూనియన్ నాయకులు సంజీవరావు, సుబ్బారావు, పెయింటింగ్ యూనియన్ నాయకులు హెబ్రీజర్ బాబు, రంగా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐలాండ్ సెంటర్ నుండి బైక్ ర్యాలీ కూరగాయల మార్కెట్ ఎమ్మార్వో ఆఫీస్ మీదుగా ఏపీఎస్ఆర్టీసీ డిపో వరకు తిరిగి ఎస్ పి పి రోడ్ గుండా ఐలాండ్ సెంటర్ కు చేరింది. జులై 9వ తేదీన జరిగే దేశదేపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుని కాపాడుకుంటామని కార్మికులు ప్రతిజ్ఞ చేశారు.

# కుంగింది బ్యారేజి కాదు, మీ బ్రెయిన్ ఉత్తం గారు.

### మాజీ మంత్రి , ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**హైదరాబాద్** ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి తీరు బోడిగుండుకు మోకాలికి ముడి పెట్టినట్లు ఉంది. మోటార్లు ఆన్ చేసి పొలాలకు నీళ్లు ఇవ్వాలని మేం అడిగితే, కుంగిన బ్యారేజ్ నుంచి ఎత్తిపోయాలా అని ప్రశ్నిస్తున్నారని మాజీ మంత్రి , ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కుంగింది బ్యారేజి కాదు, మీ బ్రెయిన్ ఉత్తం గారు. మేడిగడ్డలో ఒక్క పియర్ కుంగితే, మీ బ్రెయిన్ మాత్రం మొత్తం కుంగినట్లుంది. అసలు బ్యారేజీకి, మోటార్లు ఆన్ చేయడానికి ఏమైనా సంబంధం ఉందా ఉత్తం గారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండి అజ్ఞానాన్ని బయట పెట్టుకుంటున్నారు. కన్నెపల్లి పంప్ హౌజ్ మినిమం డ్రా లెవల్ 93.5 మీటర్లు అయితే 96 మీటర్ల ఎత్తున నీళ్లు ప్రవహిస్తున్నాయి.. కన్నెపల్లి పంపు హౌస్ మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశాం. అది చేయకుండా మళ్ళీ అవే బురద రాజకీయాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గోదావరి నీళ్లను రైతుల పొలాలకు మళ్లించాలని మేము అడుగుతుంటే, సాకులు చెబుతూ నీళ్లు కిందకు వదులుతున్నారు. 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన రికార్డు ఎలా సాధ్యం అయ్యింది ఉత్తం గారు? మీ 19 నెలల పాలనలో ఒక్క ప్రాజెక్టు కట్టారా? ఒక్క చెక్ డాం నిర్మించారా? ఒక్క చెరువు పూడిక తీశారా? కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్లు ఇచ్చారా? కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ సిస్టమ్ వల్లనే రిజర్వాయర్లు నిండాయి, చెక్ డ్యాంలు చెక్ డ్యాంలు మత్తళ్లు దుంకాయి, చెరువులు నిండుకుండలా మారాయి, భూగర్భ జిల్లాలు పెరిగాయి, పొలాలకు నీళ్ళు అందాయి. బిఆర్ఎస్ సాధించిన ఘనతను, కాంగ్రెస్ ఘనతగా చెప్పుకుంటూ తిరగటం తప్ప మీరు చేసింది ఏముంది? కల్వకుర్తి విషయంలో మీరు ఇచ్చిన ప్రెస్ నోట్ లోనే మీకు సమాధానం ఉంది. నీటి నిల్వల ఆధారంగా ఒక్కో ఏడాది ఒక్కో తేదీన లిఫ్టులు ఆన్ చేస్తుంటారు. మే 30న శ్రీశైలానికి వరద వస్తే ఇప్పటివరకు కల్వకుర్తి మోటార్లు ఎందుకు ఆన్ చేయలేదు. వరద రూపంలో నీళ్లు కిందకు తరలి వెళ్తుంటే జులై, ఆగస్టు అంటూ ముహూర్తాల కోసం ఎందుకు చూస్తున్నారు? రైతు సంక్షేమం పట్ల మీకున్న చిత్తశుద్ధి ఇదేనా? మొద్దు నిద్ర వీడి, కెసిఆర్ గారు డిమాండ్ చేసినట్లు మోటార్లు ఆన్ చేయండి.. పంట పొలాలకు నీళ్ళు ఇవ్వండి. లేదంటే మీ నిర్లక్ష్యం వల్ల వచ్చే కృత్రిమ కరువుకు మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# చింతపల్లి హెచ్.ఎన్.టిసి కార్మికుల డిమాండ్ల సాధనకు సమ్మెకు సిద్ధం.

### – సిఐటియు నాయకులు సాగిన చిరంజీవి

**చింతపల్లి/అరకులోయ** చింతపల్లి మండలంలోని హెచ్ఎన్ టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూలై 9 న దేశ వ్యాప్త సమ్మెలో హెచ్ఎన్ టి సి కార్మికులు పాల్గొంటున్నట్లు ప్రకటించిన సిఐటియు నాయకులు సాగిన చిరంజీవి తెలిపారు ఈ సందర్భంగా సిఐటియు నాయకులు చిరంజీవి మాట్లాడుతూ హెచ్ఎన్ టీ సీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోళ్లను రద్దు చేయాలని పర్మిట్ చేయాలని తదితర డిమాండ్లపై దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మెలో ప్రజా ప్రదం చేయాలని కరపత్రాలు పంచారు. డిమాండ్స్. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఐటిడిఏ డైల్వేజి కార్మికులకు పీఎఫ్ ఇ ఎస్ ఐ సౌకర్యం కల్పించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని. కార్మికులు అందరికీ రెగ్యులర్ చేయాలని మృతి చెందిన కార్మికుల కుటుంబానికి ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఎక్స్గ్రేషియా ఇవ్వాలని. డిమాండ్లతో జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొవాలని అని అన్నారు. ఈ కార్యక్రమానికి. హెచ్ఎన్ టిసి కార్మికులు పాల్గొన్నారు.

# 266 గ్రాముల గంజాయి పట్టివేత



**తూప్రాన్, జూలై 07, ప్రజాస్వరం:** గంజాయి అమ్ముతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుండి 266 గ్రాముల ఎండు గంజాయి స్వాదినం చేసుకున్న ఘటన తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తెలిపిన వివరాల మేరకు తూప్రాన్ ఎస్సై శివానందం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణంలోని పోతరాజ్ పల్లి వద్ద ఉన్న హనుమాన్ వెంచర్ లో 8మంది వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇద్దరు పారిపోగా 6 గురిని తుమ్మల ప్రశాంత్, బోసు కనకరాజు, బీహార్ కు చెందిన సంతోష్ పాశ్వన్, హరి రామ్ హీరా ల నుండి 266 గ్రాముల గంజాయి,3వేల నగదు, 5సెల్ ఫోన్ లు,2 బైక్ లను స్వాదినం చేసుకుని రిమాండ్ కు తరలించనున్నట్లు డిఎస్పి తెలిపారు.సిఐ రంగక్రిష్ణ పోలీస్ సిబ్బంది ఉన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ శివానందం, సీఐ రంగాకృష్ణ, పోలీస్ సిబ్బందిని డిఎస్పి అభినందించారు

# మనం చెట్టును కాపాడితే చెట్టు మనల్ని కాపాడుతుంది

కేరాఫ్ అడ్రెస్‌కుగా చేసేందుకు 18 కోట్ల మొక్కలు నాటే యజ్ఞం చేపట్టామన్నారు. "వనమహోత్సవం మంచి కార్యక్రమం, మనం చెట్టును కాపాడితే చెట్టు మనల్ని కాపాడుతుంది. వనమే మనం మనమే వనం అన్నారు పెద్దలు. వనం పెంచినప్పుడే అభివృద్ధి పథం వైపు నడుస్తాం. అందుకే ఇవాళ అటవీ శాఖ ఆధ్వర్యంలో 18 కోట్ల మొక్కలు నాటాలని బృహత్తర కార్యక్రమం తీసుకున్నారు. అమ్మ పేరుతో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారని రేవంత్ గుర్తు చేశారు. అదే తల్లులు రెండేసి మొక్కలు నాటితే కచ్చితంగా తెలంగాణ హరితవనంగా మారుతుందని ఆకాంక్షించారు. "మహిళలు, విద్యార్థులు, అధికారులు, మంత్రులు అందరూ వన మహోత్సవ కార్యక్రమంలో భాగమయ్యారు. అయితే నేను ప్రత్యేకంగా మా అక్కల్ని చెల్లెళ్లను విజ్ఞప్తి చేస్తున్నాను. పెరుడులో రెండు చెట్లు పెంచితే ఎంతో అద్భుతంగా ఉంటుంది. అమ్మ పేరు మీద మొక్కలు నాటాలని ప్రధానమంత్రి అన్నారు. అదే తల్లి కూడా రెండు మొక్కలు నాటి పెంచితే తెలంగాణ మొత్తం హరితవనం అవుతుంది. ఆకుపచ్చ తెలంగాణగా మారుతుంది. అమ్మ పర్యవేక్షణలో ఏం చేసినా రక్షణ ఉంటుంది. మహిళలకు ఎలాంటి బాధ్యతలు అప్పగించా విజయం వరిస్తుందని అన్నారు రేవంత్ రెడ్డి. అందుకే ప్రజాపాలనలో అన్నీ మహిళల కేంద్రంగానే చేపడుతున్నట్టు తెలిపారు. వ్యాపారాల్లో కూడా మహిళలను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. " అమ్మ ఆదర్శ పాఠశాల పేరు మీద గ్రామాల్లో పాఠశాలల నిర్వహణ బాధ్యత ఆడబిడ్డలకు అప్పగించాం. విద్యార్థుల అటెండెన్స్ ఉపాధ్యాయులు తీసుకుంటే గురువుల వచ్చారో లేదో మహిళలు చూస్తున్నారు. ఒకప్పుడు సోలార్ వ్యాపారం పెట్టాలంటే అదానీల వైపు చూడాల్సి వచ్చేది. ఇప్పుడు వాటిని స్వయం సహాయక సంఘాలకు ఇచ్చం. ఇవాళ ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్నారు. అమ్మవారి ఇంటికి వెళ్లాలన్నా అమ్మవారిని దర్శించుకోవాలన్నా కుమారుడికో భర్తకో డబ్బులు అడగాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. ఇలా ప్రయాణం చేయడమే కాదు, ఆడబిడ్డలే ఆర్టీకి కిరాయి బస్‌లు ఇస్తున్నారు. హైటెక్ సిటీ అంటే విప్రో, మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు గుర్తుకు వస్తాయన్నారు రేవంత్ రెడ్డి. కానీ హైటెక్ సిటీకి మించేలా మహిళలకు భారీ స్థలం కేటాయించి వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందించామన్నారు. మడు ఎకరాల స్థలం ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉత్పత్తి చేసే ఉత్పత్తులను అమ్మేందుకు అవకాశం కల్పించామన్నారు. " ఇవాళ హైటెక్ సిటీ అంటే విప్రో, మైక్రోసాఫ్ గుర్తుకు వస్తాయి. కానీ అక్కలకు మూడున్నర ఎకరాలలో స్థలాన్ని ఇందిరా మహిళా శక్తి పేరుతో అప్పగించాం. అక్కడ వారి తయారు చేసిన ఉత్పత్తులు అమ్ముకోవచ్చు. ఎందుకో మీడియా దీనిపై దృష్టి పెట్టడం లేదు. మొన్న నిర్వహించిన భారత్ సమ్మిట్‌కు వచ్చిన ప్రపంచ స్థాయి ప్రతినిధులు అక్కడకు వెళ్లారు. మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన వారంతా ఆ ప్రాంతాన్ని సందర్శించారు. తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారని అభినందించారు. రూపొందిస్తున్నట్టు తెలిపారు రేవంత్ రెడ్డి. దీనికి మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో 65 లక్షల మహిళా సంఘాలు ఉన్నాయని వీటిని కోటికి పెంచాలని సూచించారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక రాయితీలు ఇచ్చి కోటీశ్వరులను చేస్తామన్నారు రేవంత్. స్వయం సహాయక సంఘాలు 65 లక్షళ మంది ఉన్నారు. దీన్ని కోటికి పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాం. గతంలో 18 ఏళ్ల పైబడి 60 ఏళ్ల లోపు ఉన్న వాళ్లకే ఈ సంఘాల్లో చేరే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ వయసును 17 ఏళ్లకు తగ్గించాం. 17ఏళ్లకుపైబడిన వాళ్లు ఎవరైనా మహిళలు ఈ సంఘాల్లో చేరొచ్చు. పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు తక్కువగా ఉన్నాయి. తెలిసిన వారందర్నీ సంఘాల్లో చేర్చాలని రిక్వెస్ట్ చేస్తున్నాను. ఆత్మగౌరవంతో బతికేందుకు సన్నబియ్యం ఇస్తున్నామని తెలిపారు రేవంత్. గత పదేళ్లు మహిళల గురించి పట్టించుకున్న వారు లేరని వాపోయారు. ఆడబిడ్డలకు సన్నబియ్యం ఇస్తున్నాం. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు ఏ బియ్యం తింటున్నారో అవే ఇస్తున్నాం. ఆడబిడ్డలను మేలు జరగాలని ఆత్మగౌరవంతో బతకాలని కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాం. పదేళ్లు ఏనాడు ఆడబిడ్డలను పట్టించుకోలేదు. ఐదేళ్లు మంత్రివర్గంలో వారికి స్థానమే లేదు. ఈ మీటింగ్‌లో ఆడబిడ్డలు కూర్చొని ఉంటే మగవారు నిలబడే ఉన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇలానే ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా 60మంది మహిళలు అసెంబ్లీలో కూర్చుంటారని రేవంత్ తెలిపారు. అందుకు తగ్గట్టుగా మహిళలు నాయకులుగా ఎదగాలని అన్నారు. ఇంట్లో రెండు మొక్కలు నాటి రాజకీయ నాయకులుగా ఎదిగే కార్యచరణకు శ్రీకారం చుట్టాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇచ్చిన రిజర్వేషన్లు ఫలితంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు చోటు లభించింది. చాలా మంది నాయకులుగా ఎదిగేందుకు దారి దొరికింది. ఇప్పుడు తొందరలో ఎమ్మెల్యేలకు రిజర్వేషన్లు రాబోతున్నాయి. 153 సీట్లలో చట్టప్రకారం 50కిపైగా సీట్లు మహిళలకు వస్తాయి. నేను ప్రత్యేక చొరవ తీసుకొని 60 సీట్లు ఆడబిడ్డలకు ఇప్పిస్తాను. మంచి పేరు తెచ్చుకోండి. ఎమ్మెల్యే సీటు ఇచ్చి గెలిపించే బాధ్యత నేను తీసుకుంటా. ఇల్లు నడిపిన వాళ్లు ప్రభుత్వాలు బాగా నడుపుతారు. చెట్లు నాటడంతోనే ఈ ప్రక్రియను మొదలు పెట్టండి. రెండు చెట్లైనా నాటండి. అని పిలుపునిచ్చారు.

# ఒలింపిక్స్‌లో 2 గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి

కేటాయించి సహకరించాలని కోరారు. హైదరాబాద్ హకీంపేట్ లో అర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్డ్, ఎల్.బి.స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివృద్ధి, సింథటిక్ ట్రాక్, భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో మల్టీపర్పస్ హాల్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణ, నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి మాండవీయను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో తరహాలో రైలు ప్రయాణాల్లో ఛార్జీ రాయితీ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయను కోరారు. ముఖ్యంగా ఖేలో ఇండియా గేమ్స్ తో పాటు భారత్ లో నిర్వహించే ఒలింపిక్స్ లో రెండు గేమ్స్ తెలంగాణలో నిర్వహించాలని కోరిన రేవంత్ రెడ్డి క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని అడిగారు.


# మరో బాంబ్ పేల్చిన ట్రంప్

పెంచడంపై బ్రిక్స్ దేశాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఏకపక్షంగా, విచక్షణారహితంగా సుంకాలను పెంచడం, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం" అని బ్రిక్స్ దేశాలు ఉమ్మడి ప్రకటనలో తెలిపాయి. పర్యావరణ పరిరక్షణ పేరుతో అభివృద్ధి చెందుతున్న దేశాలపై కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు వాణిజ్య ఆంక్షలు విధించడాన్ని కూడా వారు తప్పుబట్టారు. ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు సౌదీ అరేబియా, ఈజిప్ట్, యూఏఈ, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. బ్రిక్స్ దేశాల ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్

క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం భద్రతాపరమైన చర్యలు తీసుకుంది. దేశంలోని పలు ట్రావెల్ ఏజెన్సీలు, పలు యూనివర్సిటీలు కూడా టర్కీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి.

# ఝరికోన మడుగులో యువకుడు గల్లంతు




**రాయచోటీ** స్నేహితులతో కలిసి సరదాగా ఝరికోనకు వెళ్లి మడుగులో యువకుడు గల్లంతయ్యాడు. సోమవారం వెలుగుచూసిన ఘటనపై వివరాలు.. రాయచోటికి చెందిన ఉస్మాన్, శెట్టిపల్లికు చెందిన ఎనిమిది యువకులతో కలిసి ఆదివారం ఝరికోన ప్రాజెక్టుకు వెళ్లారు. ఈత కొడదామని యువకులు దిగారు. వారిలో ఉస్మాన్ గల్లంతయ్యాడు. మిగితా నలుగురు యువకులు బయటకొచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి రాత్రి వరకు గాలించిన మృతదేహం లభించలేదని తెలిపారు

## ప్రజలు ఏది అడిగినా

# దివాలా మాటలే చెబుతున్నా సీఎం రేవంత్

- గ్రామ స్థాయి లో రేవంత్ రెడ్డిని అంత తిడుతుండ్రు
- సీఎం ను కర్రు కాల్చి వాత పెట్టే సమయం వచ్చింది
- మెదక్ లో ఇంకా కొన్ని గాడిదలు ఉన్నాయ్
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ ఎస్ లో చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు
- మెదక్ నుంచి ర్యాలీ గా వెళ్ళి బీఆర్ ఎస్‌లో చేరిక









**మెదక్ జూలై 07 (ప్రజా స్వరం)** ప్రజలు ఏది అడిగినా దివాలా మాటలే చెబుతున్నాడని, రేవంత్ రెడ్డి లాంటి లేకి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదని బీ అర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మెదక్ నియోజకవర్గం కు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు రాష్ట్ర మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్ లోని బి అర్ ఎస్ భవన్ లో సోమవారం గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలన పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందని, సీఎం కు కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజలు ఏది అడిగినా దివాలా మాటలే చెబుతున్నాడని, రేవంత్ రెడ్డి లాంటి లేకి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై గ్రామాల్లో ప్రజలు తిడుతున్న తిట్లు ఇప్పటి దాకా చరిత్రలో ఏ ముఖ్యమంత్రిని తిట్టలేదన్నారు. సిగ్గు శరం ఉన్నోడు అయితే ఈ పాటికి బకెట్ నీళ్లలో మునిగి ఆత్మహత్య చేసుకునేవాడని, కానీ రేవంత్ రెడ్డికి సిగ్గు, శరం, మానం, ఇజ్జత్ లేదు కాబట్టే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తానని ఎన్నికల ప్రచారంలో చెప్పి అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి ప్లేటు ఫిరాయించాడన్నారు. 50 వేల కోట్ల రూపాయల రుణమాఫీని 12 వేల కోట్లకు మాత్రమే పరిమితం చేశాడని, కానీ మొత్తం రుణమాఫీ చేశానని గొప్పలు కొట్టుకుంటున్నాడన్నారు. కేసీఆర్ బిచ్చమేసినట్టు ఒక్క పంటకే ఎకరాకు పదివేలు ఇస్తున్నాడు నేను అధికారంలోకి వస్తే నేను రెండు పంటలకు ఎకరాకు రూ 15000 వేలు రైతు భరోసా ఇస్తానని చెప్పి అన్నదాతలను రేవంత్ నిలువునా మోసం చేశాడన్నారు. అత్తకు నెలకు రూ 4 వేలు, కోడలకు నెలకు 2500 ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పిండన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని చెప్పుకుంటున్నాడనీ, వంద కాదు వాని బొంద అన్నా రావన్నారు. ఢిల్లీకి పోతే దొంగల్లాగా చూస్తు చెప్పులు ఎత్తుకుపోయే దొంగల్లాగా చూస్తున్నారని ఎవరైనా ముఖ్యమంత్రి చెప్పుకుంటాడా? అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ , చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రులను చూసిన ప్రజలు రేవంత్ రెడ్డి ని చూసి ఛీ అనుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే డ్రైనేజీ కంపు, గబ్బు మాటలు, గబ్బు వ్యవహారాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం న్యాయమా? తెలంగాణ సీఎం కుర్చీలో కూర్చునే భాగ్యం రేవంత్ రెడ్డికి రావడానికి కారణం కేసీఆర్ కాదా? అన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ లేకపోతే గులాబీ జెండా ఎగరకపోతే ఇవాళ తెలంగాణ వచ్చేదా.. అని ప్రశ్నించారు. హరీష్ రావు దగ్గర రేవంత్ రెడ్డి శిష్యరికం చేసిండని, హరీష్ రావు మంత్రి అయినప్పుడు ఇదే తెలంగాణ భవన్ ముందు రేవంత్ డాన్సులు కూడా చేశాడన్నారు. బి అర్ ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు రేవంత్ రెడ్డి లాగా లేకి పనులు చేయలేదని , ప్రతిపక్షాల మీద అడ్డమైన కేసులు పెట్టలేదు , ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను పోలీసులతో కొట్టియ్యలేదన్నారు. నర్సింగ్ అనే బీఆర్ఎస్ కార్యకర్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెడితే పోలీసులు అక్రమంగా తీసుకెళ్లి తీవ్రంగా హింసించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా ? నిలదీశారు. కేసులు పెట్టుడు, రోకలిబండ ఎక్కించుడు, ఇష్టం వచ్చినట్టు కొట్టుడు, భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా ముఖ్యమంత్రిని పొగడమే పనిగా పెట్టుకోవాలా? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలకు ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడు ముఖ్యమంత్రిని కచ్చితంగా ప్రజలే పొగుడుతారని, తెలంగాణ మీద కక్ష చూపించకుండా, ప్రతిరోజు తెలంగాణ జాతిని అవమానించకుండా, కేసీఆర్ కంటే తెలంగాణకు ఎక్కువ మంచి చేస్తే తప్పకుండా రేవంత్ రెడ్డి గురించి నాలుగు మంచి మాటలు ప్రజలు చెబుతారన్నారు. లేకుంటే బరాబర్ రేవంత్ రెడ్డిని ప్రజలు నిలదీస్తారని, తెలంగాణ రక్తంలోనే తిరుగుబాటు స్వభావం ఉంటుందన్నారు. మూడున్నర సంవత్సరాలు ఇంకా అధికారంలో ఉండే పార్టీని ఛీ కొట్టి ప్రతిపక్ష పార్టీలోకి రావడం అంటే మామూలు విషయం కాదన్నారు.

### మెదక్ లో ఇంకొన్ని గాడిదలు.

మెదక్ నియోజక వర్గం నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు బి అర్ ఎస్ లోకి తిరిగి రావడం పై స్వాగతం పలికారు. మెదక్ గతంలో బాగానే గాడిదలు ఉండేవని, వాటన్నింటిని తరిమి వేశామని, కానీ కొన్ని గాడిదలు మాత్రం మిగిలాయన్నారు. వాటిని బి అర్ ఎస్ కార్యకర్తలు తరిమి కొడతారని చెప్పారు. మూడేళ్ల పాటు అధికారం కాంగ్రెస్ పార్టీ కి ఉన్న అధికార పార్టీ నుంచి తిరిగి రావడం పై కాంగ్రెస్ నేతల తీరు ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు.

బి అర్ ఎస్ పార్టీ లో కార్యకర్తలకు ఎల్లవేళల అండగా ఉంటుందని, వారికి అన్ని విధాలుగా ఉంటామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బి అర్ ఎస్ లోకి తిరిగి వచ్చిన మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గంగా నరేందర్, జీవన్ రావు, మాజీ కౌన్సిలర్ విజయ లక్ష్మి, స్వామి నాయక్ తదితరులు పార్టీ లో చేరారు. మెదక్ నుంచి వాహనాల్లో బారీ ర్యాలీగా తెలంగాణ భవన్ కు నేతలు తరలి వెళ్లారు.

## టయోటా షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మెదక్ జూలై 07 (ప్రజా స్వరం)** మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల్ వద్ద సోమవారం మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హర్ష టయోటా కార్ల షోరూం ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా హర్ష టయోటా వైస్ ప్రెసిడెంట్ వై.బి స్వామి మాట్లాడుతూ టయోటా అంటే చాలా మందికి పెద్ద పెద్ద కార్లు ఉంటాయనే ఆలోచన ఉంటుందని, కానీ గ్రామాల్లోని సామాన్య ప్రజలకు కూడా చిన్న కార్లను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో షోరూం ప్రారంభించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కటికేల గోపి జన్మదిన వేడుకలు



శామీర్ పేట జూలై 7(ప్రజా స్వరం) మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటికేల జన్మదిన వేడుకలో గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు పలువులు రాజకీయ ప్రముకులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాథం, మండల యూత్ మాజీ అధ్యక్షుడు కటికేల వైద్యనాథ్ తదితరులు హాజరై కేక్ కట్ చేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల పాలిట వరం

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం

- ప్రజా పాలనకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత
- 400 మందికి 4 కోట్ల రూపాయల కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ పథకానికి ఖర్చు చేశాం...
- పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం...
- 10 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి 18 నెలల్లో పూర్తి చేసి చూపిస్తున్నాం.
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.



**మెదక్ జూలై 07 (ప్రజా స్వరం)** పేదింటి ఆడబిడ్డల పాలిట వరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. సోమవారం హవేలీ ఘన్పూర్ మండలం రైతు వేదికలో పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో హవేలిఘన్పూర్ తాసిల్దార్ సింధు రేణుక, సంబంధిత ప్రజా ప్రతినిధులు ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ హవేలీ ఘన్పూర్ మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీలో భాగంగా 25 కుటుంబాలకు 25 లక్షల 2900 రూపాయలు అందించడం జరిగింది అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇంతకు ముందు 10 ఏళ్ల క్రితం మైనంపల్లి హనుమంతరావు ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలను గత పాలకులు మేమే చేసినాము అని అబద్ధ మాటలతో కాలయాపన చేశారని, నియోజకవర్గంలో ప్రజలు ఎలా ఉన్నారు, ఏమి తింటున్నారు వారి యోగక్షేమాలు చూసే నాధుడే లేకుండా ఉండే, అని అదేవిధంగా తెలంగాణను అప్పులు పాలు, ఆగం పట్టించిండ్రు, గత 10 సంవత్సరాలలో ఏ ఒక్కరికి కూడా ఇల్లు రాలేదని, ఇండ్లు, దళిత బంధు పేరిట కాలాన్ని గడుపుతూ ప్రజా సంక్షేమమే మరిచితిరని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి మెదక్ నియోజకవర్గంలో ఏడుపాయల అమ్మ వారి టెంపుల్ కు ఒక్కసారి కూడా వచ్చిన పాపాన పోలేదని, మన ప్రజా ప్రభుత్వం ఏడుపాయల అమ్మవారి ఆలయం, మెదక్ చర్చి అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం, ఏర్పడి 18 నెలల్లోనే మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వేల కోట్ల రూపాయలు ప్రజల సేవా సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారని,సన్న బియ్యం ఇస్తూనే రాష్ట్రవ్యాప్తంగా 25 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పారు.రైతు భరోసా రైతు బీమా, సన్న బియ్యం, ఆర్టీసీ మహాలక్ష్మి పథకం పటిష్టంగా అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## బదిలీలుతో పాటు

# పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలి

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- టిపిటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు యాదగిరి.




**మెదక్ జూలై 07 (ప్రజా స్వరం)** ఉపాధ్యాయుల బదిలీలు తో పాటు పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని టిపిటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు యాదగిరి అన్నారు. సోమవారం మెదక్ పట్టణంలోని స్థానిక ఉపాధ్యాయ భవనంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని,ఇంటర్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్లోకి మార్చి అర్హత కల ఉపాధ్యాయులకు ప్రోమోషన్లను కల్పించాలని విద్యా శాఖలో ఇంచార్జీల స్థానంలో రెగ్యులర్ డీఈవో, ఏంఇఓ లను నియమించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. ఖాళీలుగా ఉన్న అన్ని కాడర్ల పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని,జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో ఒక రెగ్యులర్ ఉపన్యాసకుడు లేకుండా ఉండడం తద్వారా ఉపాధ్యాయ శిక్షణ పూర్తిగా ధ్వంసం అయిందని వెంటనే రెగ్యులర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత 3 సంవత్సరాల కాలం పాటు పెండింగ్ లో ఉన్న మెడికల్,భవిష్య నిధి చెల్లింపులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.చాలా మంది ఉపాధ్యాయులు బిల్లుల చెల్లింపులు ఆగిపోవడంతో తీవ్ర మనోవేదనతో అనారోగ్యంతో మరణించడం జరుగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఏ పి టి ఎఫ్ ఆధ్వర్యంలో రైతుల ఆత్మహత్యల నివారణ కొరకు కృషి చేసిన విధంగా నేడు ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మ హత్యల నివారణ కొరకు దీర్ఘ కాలిక ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపును ఇచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి,గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, నసీరుద్దీన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హీరా లాల్,రాజేంద్ర ప్రసాద్, సంగీత ,అల్వాల రమేష్, నజీరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## తూంకుంట పురపాలక సంఘం కమిషనర్ జ్యోతికి శుభాకాంక్షల వెల్లువ:ఆర్టిఏ మెంబర్ బిమిడి.జైపాలరెడ్డి



శామీర్ పేట జూలై 7(ప్రజా స్వరం) ఇటీవల తూముకుంట మున్సిపాలిటీ కమీషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఏం.ఏన్.ఆర్ జ్యోతికి సోమవరం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి తూంకుంట పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ ఏం.ఎన్.ఆర్ జ్యోతి నీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

# మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్

హైదరాబాద్ మంగళవారం 8, జులై 2025

# అతి భారీ వర్షాలు

ఆదిలాబాద్, : తెలంగాణలో నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది.

## పరువలు తొక్కుతున్న పొచ్చెర జలపాతం

బోథ్, : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతం పరవళ్లు తొక్కుతూ మనసును హత్తుకుంటోంది. పొచ్చెర అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. భారీగా వరద నీరు చేరుకోవడంతో ఉద్ధృతంగా ఉరకలేస్తోంది. పర్యావరణ ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటోంది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నిర్మల్,: ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి టోల్ గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. వాంకిడి నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న బైక్ ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఖిరిడికి చెందిన గణేశ్ కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఖానాపూర్, : భూములను ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం లక్ష్మణ్ చాంద మండలం బోరిగాంలో పర్యటించారు. ఈ సందర్భంగా 3 ఎకరాల ప్రభుత్వ భూమిలో పల్లె ప్రకృతి వనంకు కేటాయించగా కొందరు అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకుంటున్నారని తనిఖీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే ఎమ్మెల్యే భూఆక్రమణ జరిగిన ప్రాంతానికి వెళ్లారు. ఆక్రమణల వెంటనే తొలగించాలని ఆదేశించారు.

## జన్నారం మండల ప్రజలకు ఎస్ఐ సూచన

ముథోల్, : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో నాలుగైదు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నదితో పాటు వాగులు, వంకలు, ఒర్రెలు వరద నీటితో ప్రవహించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు, పశుకాపరులు అటువైపుగా వెళ్లవద్దని ఆమె సూచించారు. అత్యవసరమైతే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై అనూష కోరారు.

## సమ్మెను విజయవంతం చేయండి

సిరిసిల్ల, : రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 282 ని ఉపసంహరించుకోవాలని నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి కోడం రమణ మీడియాతో మాట్లాడారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్

వేములవాడ,: రాష్ట్రంలోని బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనార్టీ పేద ప్రజలకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో చెక్కపల్లి బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ వేములవాడవారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భవ దినోత్సవ, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

పెద్దపల్లి, : పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన కుంట శివ, కొత్తపల్లికి చెందిన ఎలాబోతరం శంకరయ్య, ఓదెల మండలం రూపునారాయణపేటకి చెందిన ఎడ్ల అర్చన్ కోవెల్ లకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కులను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు సోమవారం పంపిణీ చేశారు. శివకి రూ. 1. 50 లక్షలు, శంకరయ్యకి రూ. 1. 50 లక్షలు, అర్చన్ కోవెల్ కి రూ. 2లక్షల విలువ గల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కొత్తగూడెం,: ఇల్లందు మండలంలో రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హనుమంతుల పహాడ్ ఆగి ఉన్న బోర్ వెల్ డీసీఎంను బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ పై ఉన్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొల్లపురం గ్రామానికి చెందిన చీమల ప్రణీత్ (25) మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బూడిదంపాడులో ముదిరాజుల ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు

ఖమ్మం, : రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మండలంలోని బూడిదంపాడు గ్రామంలో ముదిరాజుల ఆధ్వర్యంలో సోమవారం పెద్దమ్మ తల్లి ఆషాడ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. సామూహికంగా బోనాలు సమర్పించడం విశేషంగా నిలిచింది.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలించి కాంగ్రెస్ నాయకులు

సత్తుపల్లి, : తల్లాడ మండలం తెలగవరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులను తెలగవరం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మోత్కూరు శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వారాల అజయ్ సోమవారం పరిశీలించారు. అనంతరం వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెత్తాచెదారాలు ఇంటి పరిసర ప్రాంతాలలో వేయకుండా ఉండాలని తగు సూచనలు చేశారు.

## రుణమాఫీ ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలి

వైరా, : కారేపల్లి మండలంలోని గాంధీనగర్ లో ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన మండల కార్యదర్శి నరేంద్ర నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణా తరగతుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు పాల్గొని సోమవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న రుణమాఫీ ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చలపతిరావు, రామారావు, సాంబశివరావు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉంచాలి

పాలేరు, : రైతులకు అవసరమైన యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ లో జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా యూరియా ఉత్పత్తి తగ్గించి సరఫరాలో కోత పెట్టిందన్నారు. సాగర్ ఆయకట్టు, వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ ఆర్కె



పాలకుర్తి, : పాలకుర్తి మండలం ఎసల తక్కళ్లపల్లి గ్రామంలో బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలకు జిల్లా ఇన్ ఛార్జ్ కె. రాజేంద్ర కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి సోమవారం కేక్ కట్ చేశారు. గ్రామ అధ్యక్షులు రెడపాక రాములు, ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి వెంకటస్వామి, జిల్లా నాయకులు ములుకల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే

వరంగల్ ఈస్ట్,: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వరంగల్ పర్యటనకి విచ్చేశారు. ఈ సందర్భంగా సోమవారం వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీనందు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

## దంపతుల పై గొడ్డలితో దాడి

మహబూబాబాద్,: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బక్క చంద్రు తండాలో దంపతులపై సోమవారం తెల్లవారు జామున గొడ్డలితో దాడి చేశారు. తండాకు చెందిన బానోత్ మంగ్యా, ద్యాలి అనే దంపతుల పై అదే తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులుదాడి చేశారు. గొడ్డలి, రోకలి బండతో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన దంపతులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో దాడి చేసిన వారిపై బంధువులు పిర్యాదు చేశారు.

## పారిశుద్ధ్య నిర్వహణ లోపంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

జనగామ, : జనగామ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నెహ్రూ పార్క్ నుండి ఆర్టీసీ చౌరస్తా వరకు రోడ్లు ఊడుస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

మెదక్, : మెదక్ జిల్లా రామాయంపేటలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెదక్ చౌరస్తా వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ నాయకుల నిరసన ర్యాలీ

నర్సాపూర్, మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఏఐటీయూసీ నాయకులు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు విష్ణు, ఆనంద్, మల్లేశ్, నాగులు, శ్రీనివాస్, బిక్షపతి, నారాయణ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలి



సిద్దిపేట,: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. హత్నూర మండలం దౌల్తాబాద్ కు జీపు జాత సోమవారం చేరింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని విమర్శించారు.

## అవసరాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి

సంగారెడ్డి,: రుద్రారం గణేష్ గడ్డ ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రధానంగా నిత్య అన్నదానం కోసం ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక కిచెన్ తో పాటు వివాహాది శుభకార్యాల కోసం కళ్యాణమండపం, శాలహారం, గుడి ఆదాయం కోసం దుకాణాల సముదాయం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గుడిని అభివృద్ధి పరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

## స్కూల్ బస్సులకు తృటిలో తప్పిన పెను ప్రమాదం

ఆలంపూర్, : అదుపు తప్పి స్కూల్ బస్సు దూసుకెళ్లిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం తుంకుంట గ్రామ సమీపంలో విద్యార్థులతో వస్తున్న రెండు బస్సులు ఎదురెదురు రావడంతో రోడ్డు వెడల్పు లేకపోవడంతో ఓ బస్సును దాటే క్రమంలో మరో బస్సు అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ఏం కాకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## 22 ఫీట్లకు చేరిన కోయిల్ సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

దేవరకద్ర, : దేవరకద్ర నియోజకవర్గం కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు సోమవారం నీటిమట్టం 22 ఫీట్లకు చేరిందని ప్రాజెక్టు అధికారి ప్రతాప్ సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 32. 5 ఫీట్లు. జూరాల జలాశయం నుండి కొన్ని రోజులుగా జూరాల నుంచి కృష్ణా జలాలను కోయిల్ సాగర్ కు తరలిస్తుండడంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది.

## దేవబండలో 8 పొట్టేళ్ల దొంగతనం

గద్వాల,: అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం దేవబండలో పొట్టేళ్లు దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన బజారన్న, పరుశురాముడు, తదితరులు కలిసి గ్రామ శివారులోని షెడ్డులో పొట్టేళ్లు పెంచుతున్నారు. శనివారం రాత్రి యథావిధిగా షెడ్డులో పొట్టేళ్లు కట్టేసి ఇంటికి వచ్చారు. వెళ్లి చూడగా పొట్టేళ్లు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. 8పొట్టేళ్లు దొంగతనం జరిగిందని, వాటి విలువ సుమారు రూ. 1. 30 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు.

## మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వీధికుక్కల నియంత్రణ చర్యలు

వనపర్తి,: వనపర్తి పట్టణంలో వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వీధి కుక్కలను పట్టుకుని వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించి, తిరిగి సురక్షితంగా అదే ప్రాంతంలో వదిలిపెట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ చర్యల ద్వారా వీధి కుక్కల సంఖ్యను నియంత్రించడమే కాకుండా, వాటి వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించాలని మున్సిపాలిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నల్లగొండ, : నల్గొండ జిల్లా కనగల్లులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో సాయంత్రం వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ పి.విష్ణు ప్రకారం జి. చెన్నారం గ్రామానికి చెందిన దుబ్బ సత్తయ్య (45) పొలానికి వెళ్లాడు. సాయంత్రం కాలినడకన ఇంటికి తిరిగి వస్తున్న ఈ క్రమంలో బైక్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ

నకిరేకల్,: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని బాబసాహెబ్ గూడెంలో నిర్వహించిన మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, కాసేపు దూల ఆడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద

నాగార్జునసాగర్, : నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతుంది. సోమవారం జలాశయానికి ఇన్ ఫ్లో 58,205 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 4,899 క్యూసెక్కులుగా ఉంది. ఇక ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590.00 అడుగులకుగాను 527.900 అడుగులు, పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలకుగాను 164.0961 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఒకటి రెండు రోజుల్లో జలాశయానికి భారీ వరద ప్రవాహం రానుంది.

## బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేత

భువనగిరి,: యాదాద్రి భువనగిరి జిల్లా భూధాన్ పోచంపల్లి మండలం జగత్ పల్లి గ్రామానికి చెందిన శోభ అనారోగ్యంతో నిమ్స్ లో చేరింది. విషయం తెలుసుకున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి రూ. 3,20,000 (మూడు లక్షల ఇరవై వేలు) ఎల్ఓసి చెక్కును వారి కుటుంబానికి అందజేశారు. ఆపదలో ఉన్న తమకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అండగా ఉన్నారని తెలియజేశారు.

## టైరు పేలి కల్తీకల్లు వాహనం బోల్తా



బోధన్,: నవీపేట్ మండలంలోని యంచ కల్లు బట్టీకి కల్తీ కల్లు తరలిస్తున్న వాహనం టైరు పేలి బోల్తాపడగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల.. ప్రకారం బొలెరో వాహనంలో కల్లు డిపో నుండి యంచ గ్రామ కల్లు బట్టీకి కల్తీ కల్లు తరలిస్తుండగా మార్గ మధ్యలో వాహనం టైరు పేలి బోల్తా పడగా రోడ్డంతా కల్లు సీసాలు పగిలి చెల్లాచెదురు కాగా గాయాలైన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999